సాక్షి
నారాయణపేట

మంగళవారం । 26 । నవంబర్ । 2024



స్వర్ణోత్సవ శోభ..
కొల్లాపూర్‌లోని ఆర్ఐడీ పాఠశాల స్వర్ణోత్సవాలకు సుందరంగా ముస్తాబైంది.

వివరాలు 8లో ▸



కురుమూర్తివాసా గోవిందా
కురుమూర్తిస్వామి జాతరకు భక్తులకు భారీగా తరలివస్తున్నారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
31.8 /12.2

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఉంటుంది. రాత్రి చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి



నారాయణపేట ఎడ్యుకేషన్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కేజీబీవీ, గురుకుల బాలికల పాఠశాలను ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. స్టోర్ రూంతోపాటు నిల్వ చేసిన కూరగాయలు, వంట సామగ్రిని, విద్యార్థులకు వండిన ఆహారాన్ని పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడుతూ.. రోజు నాణ్యమైన భోజనం పెడుతున్నారా ఏవైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. టీచర్ల కొరత ఉంది అని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించి కొత్త టీచర్లను వెంటనే నియమించాలని, ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి అక్కడే భోజనం చేశారు. ఎమ్మెల్యేతో పాటు మార్కెట్‌చైర్మన్ శివారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ హరినారాయణభట్టడ్ తదితరులు ఉన్నారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి



నారాయణపేట/ నారాయణపేట టౌన్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ట్రైనీ కలెక్టర్ గరిమా నరుల అధికారులకు సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 25 ఫిర్యాదులు అందాయి. జిల్లా నలుమూలల నుంచి పలువురు హాజరై తమ సమస్యలు పరిష్కరించాలని ట్రైనీ కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. కాగా, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ట్రైని కలెక్టర్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రాంచందర్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 7 అర్జీలు
ప్రజావాణి కార్యక్రమంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ స్వయంగా బాధితుల నుంచి 7 ఫిర్యాదులను స్వీకరించి వాటిని చట్టప్రకారం పరిశీలించాలని ఎస్ఐలు, సిఐలకు ఫోన్ ద్వారా సూచించారు. కుటుంబ గొడవలకు సంబంధించి 1, డబ్బులకు సంబంధించి 2, భూములకు చెందినవి 4 ఫిర్యాదులు అందాయి. కాగా, భూ తగాదాలకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా కోర్టు ద్వారానే పరిష్కరించుకోవాలని లేదా సామరస్యంగా మాట్లాడుకొని సమస్యలు పరిష్కరించుకోవాలని ఎస్పీ సూచించారు. ఫిర్యాదులను చట్ట ప్రకారం పరిష్కరించాలని అధికారులకు సూచించారు. న్యాయం అందించి భరోసా, భద్రత కల్పించాలని ఆదేశించారు.

ధాన్యం తరలుతోంది!



కర్ణాటకకు తరలించేందుకు తీలేర్ వద్ద వాహనంలో ధాన్యాన్ని లోడు చేస్తున్న హమాలీలు

- దళారుల మాయలో రైతులు.. తక్కువ ధరకు విక్రయం
- యథేచ్ఛగా కర్ణాటకకు తరలింపు
- పేరుకే సరిహద్దు చెక్‌పోస్టులు.. పట్టించుకోని అధికారులు
- రూ.లక్షల్లో మార్కెట్ ఆదాయానికి గండి

మరికల్: రాష్ట్రంలోని ధాన్యానికి పక్క రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉండడంతో.. ఇదే అదునుగా కొందరు దళారులు రైతులకు మాయమాటలు చెప్పి తక్కువ ధరకు కొనుగోలు చేసే పనిలో పడ్డారు. జిల్లా వ్యాప్తంగా ఏ మూలకు చూసిన దళారులు పాతుకుపోయారు. రైతులు పండించిన ధాన్యంపై కన్నేసి వారి అవసరాలను బట్టి మాయమాటలు చెప్పి తక్కువ ధరలకే ధాన్యం కొనుగోలు చేసి దర్జాగా కర్ణాటకకు తరలించేస్తున్నారు. పెద్ద ఎత్తున వరి ధాన్యం పక్క రాష్ట్రానికి తరలిస్తున్నా రాష్ట్ర సరిహద్దు వద్ద చెక్‌పోస్టులు ఉన్నా లేనట్లుగా పరిస్థితి తయారైంది. కర్ణాటక రాష్ట్రానికి చెందిన మిలర్లు నేరుగా రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించే పనిలో పడ్డారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని అనుమతి లేకుండా కొందరు అక్రమంగా రాష్ట్రం దాటిస్తున్నారు. దీంతోపాటు కర్ణాటక మిల్లర్లకు జిల్లాలో కొందరు కమీషన్ ఏజెంట్లుగా ఉండి ధాన్యం కొనుగోలు చేసి మార్కెట్ యార్డు అనుమతి లేకుండా అక్రమంగా సరిహద్దులు దాటిస్తున్నారు. దీంతో రూ.లక్షల్లో పేట మార్కెట్ శాఖ ఆదాయానికి గండి పడుతోంది.

ఆరబెట్టిన ధాన్యంకు రూ. 2500
ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల దగ్గర అనేక కొర్రీలు పెట్టడం వల్ల దీన్ని సొమ్ము చేసుకున్న కమీషన్ ఏజెంట్లు రైతుల పొలాల వద్దకు వెళ్లి అప్పుడే కోత వేసిన ధాన్యం క్వింటాల్‌కు రూ. 2,100, ఆరబెట్టిన ధాన్యానికి రూ.2,500 వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. కమీషన్ వ్యాపారులకు కర్ణాటక మిల్లర్లు బస్తాకు రూ.10 చొప్పున కమీషన్ ఇస్తారు. అంతే కాకుండా, రైతుల వద్ద రూ.100కు రూ.2 చొప్పున కమీషన్ తీసి రైతులు అమ్మిన ధాన్యానిని లెక్క కట్టి చిట్టిరాసి చేతుల్లో పెట్టి నిలువునా దోచుకుంటున్నారు.

పట్టుబడ్డ ధాన్యం లారీ.. మేల్కొని అధికారులు

నారాయణపేట చెక్‌పోస్టు వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇటీవల ధాన్యం కర్ణాటకకు తరలిస్తూ ఓ లారీ పట్టుబడింది. నిత్యం పదుల సంఖ్యలో లారీల్లో తెలంగాణ ధాన్యం పక్క రాష్ట్రానికి తరలి వెళ్తోంది. జిల్లాలో మొత్తం 64 బియ్యం మిల్లులుండగా వీటిలో 41 మిల్లులు మాత్రమే లైసెన్స్‌తో కొనసాగుతున్నాయి. లైసెన్స్ లేని మిల్లులకు మార్కెటింగ్ శాఖ అధికారులు నోటీసులు ఇచ్చారు. అయినా యజమానులు స్పందించలేదు. చివరకు షోకాజ్ నోటీసులు జారీ చేయగా నలుగురు తమకు లైసెన్స్ మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. వీరి దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి. మిగతా 19 మిల్లు యజమానుల్లో ఎలాంటి స్పందన లేకపోవటం గమనార్హం. లైసెన్స్ లేని మిల్లుల యాజమానులు అక్రమంగా ధాన్యం కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు ఆరోపణాలు ఉన్నాయి.

చర్యలు తీసుకుంటాం

రైతులను మోసం చేసి ధాన్యం కొనుగోలు చేస్తున్న దళారులు, వ్యాపారులపై నిఘా పెట్టాం. మార్కెట్ శాఖ అనుమతులు లేకుండా ధాన్యం ఇతర రాష్ట్రాలను తరలిస్తే చర్యలు తీసుకుంటాం. ఇక జిల్లాలో లైసెన్స్ లేని మిల్లులకు నోటీసులు జారీ చేయడం జరిగింది.

– భారతి, వ్యవసాయ మార్కెట్‌శాఖ కార్యదర్శి, నారాయణపేట

రూ.కోట్లలో వ్యాపారం..

ప్రతి మిల్లులో ఏటా రూ.కోట్లలో వ్యాపారం జరుగుతోంది. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తే మార్కెట్‌కు నూటికి 1 శాతం చొప్పున చెల్లించాలి. ఇలా జిల్లా వ్యాప్తంగా ప్రతి ఏడాది సుమారు రూ.3 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు వ్యాపారం సాగుతోంది. ఇలా నాలుగైదు ఏళ్లుగా రూ.లక్షల్లో మార్కెట్ ఆదాయానికి నష్టం వస్తోంది. జీఎస్టీ రూపంలో కూడా రూ. లక్షల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. లైసెన్స్ ఉంటే మార్కెట్‌కు పెద్ద మొత్తంలో ఆదాయం వచ్చేంది. ప్రభుత్వం రైతుల నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేసిన ధాన్యానికి మార్కెట్‌కు, జీఎస్టీ ప్రభుత్వమే చెల్లిస్తుంది. లైసెన్స్ లేని మిల్లు యజమానులు రైతుల నుంచి పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు చేసి మార్కెట్ ఫీజు, జీఎస్టీ చెల్లించకుండా అందినంత దోచుకుంటున్నారు.



పస్పుల వద్ద రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేస్తున్న దళారీ

సర్వే వివరాల నమోదులో తప్పులకు తావివ్వొద్దు



ధన్వాడ మోడల్ పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్

నారాయణపేట ఎడ్యుకేషన్/ధన్వాడ: సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా సేకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసే విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని.. తప్పులకు తావివ్వొద్దని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని చిట్టెం నర్సిరెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, ధన్వాడలో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఒక్కో దరఖాస్తు వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసేందుకు ఎంత సమయం పడుతుందని ప్రశ్నించగా, సుమారు 15 నిమిషాల వ్యవధి అవుతోందని ఆపరేటర్లు తెలియజేశారు. ఎన్యుమరేటర్, సూపర్‌వైజర్లు లింక్‌ను జతపరుస్తూ వివరాలను ఆన్‌లైన్ నమోదు చేస్తున్నామని అన్నారు. నిబంధనలను పక్కాగా పాటిస్తూ అన్ని వివరాలను ఆన్‌లైన్‌లో జాగ్రత్తగా నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు. శిక్షణ సందర్భంగా సూచించిన అంశాలను తూచా తప్పకుండా పాటించాలని, చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఇబ్బందులు, సాంకేతికపరమైన సమస్యలు ఏవైనా ఉత్పన్నమైతే వెంటనే అధికారుల దృష్టికి తేవాలన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులపై ఆగ్రహం
అనంతరం కిష్టాపూర్, గోటూర్ గ్రామాలలో ఏర్పాటు చేసిన ఐకెపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాలలో సన్న, దొడ్డు రకం ఏ మేరకు వస్తున్నాయని అడిగి తెలుసుకున్నారు. సన్నారకం వడ్లను ప్రభుత్వం రూ.500 బోనస్‌ను 48 గంటల్లో ఇస్తుందని తెలిపారు. అలాగే, మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతగా లేకపోవడం 300 మంది విద్యార్థులకు ఇలాంటి భోజనం పెడతారా అంటూ ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏజెన్సీని వెంటనే తొలగించి ఇతరులను నియమించాలంటూ సంబంధిత అధికారులను ఆదేశించారు.

యాదవుల సంక్షేమానికి పెద్దపీట

నారాయణపేట టౌన్/నారాయణపేట ఎడ్యుకేషన్: యాదవుల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా అఖిలభారత యాదవ సభ ఆధ్వర్యంలో సదర్ ఉత్సవాలను సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించగా.. యాదవులు భారీగా తరలివచ్చారు. పట్టణంలోని బారంబావి దగ్గర దున్నపోతుకు డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి, యాదవులు ప్రత్యేక పూజలు చేశారు. రిబ్బన్లు, నెమలి ఈకలతో దున్నపోతులను అందంగా అలంకరించి డీజే పాటలకు నృత్యాలు చేస్తూ.. యువకులు భారీ రాలీ నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో యాదవ సంఘం భవన నిర్మాణానికి కావాల్సిన ప్రభుత్వ భూమిని వచ్చే ఏడాదిలోపు ఇప్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సదర్ ఉత్సవాల ద్వారా నాయకత్వ లక్షణాలు, ఐక్యతను పెంపొందించుకోవాలని అఖిల భారత యాదవ మహాసభ నాయకులు అన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ రాంచందర్ నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ, వైస్ చైర్మన్‌హరినారాయణ భట్టడ్, బీజేపీ రాష్ట్ర నేత నాగూరావు నామాజీతోపాటు హరిబాబు యాదవ్, లడ్డుయాదవ్, యాదవ సంఘం నాయకులు సత్యయాదవ్, బాలప్ప, తిరుపతి, రఘువీర్, గోపాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సదర్ ఉత్సవాల్లో దున్నపోతు విన్యాసాలు

మార్మోగిన శివనామస్మరణ



జిల్లా కేంద్రంలో శివలింగేశ్వర ఆలయంలో అలంకరణలో స్వామివారు

- కార్తీకమాసం చివరి సోమవారంతో ఆలయాల్లో ప్రత్యేక పూజలు



సింగార్ బేస్ శివాలయంలో ఉసిరి చెట్టుకి దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న మహిళలు



మక్తల్ మండలం పస్పుల వద్ద ఉసిరి చెట్టు కింద మహిళల ప్రత్యేక పూజలు

నారాయణపేట రూరల్/మక్తల్: జిల్లాలోని ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో శివాలయాలతోపాటు ఇతర ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే శివాలయాల్లో లింగానికి పంచామృతాభిషేకం, బిల్వార్చన, పుష్పాలంకరణ, ఫల, నైవేద్య సమర్పణ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం మహా మంగళహారతి చేపట్టి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. జిల్లా కేంద్రంలోని శివలింగేశ్వర ఆలయంలో పెరుగన్నంతో అలంకరణ ఆకట్టుకుంది. లింగయ్య గుడి, భారంభవి శివాలయం, మహంకాళి శివాలయం, పాండురంగ స్వామి శివాలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా తయారు చేసిన 101 వత్తుల దీపాన్ని దంపతులు, ఉసిరి దీపాన్ని మహిళలు, యువతులు వెలిగించారు.

■ మక్తల్ మండలం వల్లాభాపురంలో పస్పుల నది ఒడ్డున సత్యనారాయణస్వామి వ్రతాలు, పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్తిక మాసం కావడంతో ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేసి అక్కడే వన భోజనాలు చేశారు.

అడ్డు తొలగేనా..?!

- ప్రధాన అడ్డంకిగా మారిన భూసేకరణ ప్రక్రియ
- ముందుకు సాగని ఎంజీకేఎల్ఐ పెండింగ్ పనులు
- ప్యాకేజీ 29, 30 విస్తరణకు పూర్తికాని 143 ఎకరాల భూసేకరణ
- రైతులకు నష్టపరిహారం అందించడంలో తీవ్ర జాప్యం
- ఏళ్లుగా పూర్తి ఆయకట్టుకు అందని సాగునీరు



వెల్దండ మండలం చెరుకూరు శివారులో కొనసాగుతున్న కేఎల్ఐ పనులు

సాక్షి, నాగర్‌కర్నూల్: మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం విస్తరణ పనులు సుమారు 20 ఏళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తిచేసేందుకు భూసేకరణ ప్రక్రియ ప్రధాన సమస్యగా మారింది. భూములు కోల్పోతున్న రైతులకు సకాలంలో న్యాయమైన పరిహారం అందించాల్సి ఉండగా.. ఏళ్ల తరబడి తీవ్ర జాప్యం కొనసాగుతోంది. భూసేకరణ పూర్తయిన చోట ఇప్పటికీ పరిహారం అందక రైతులు నిరీక్షిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనుల కన్నా ముందుగా కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పనులను పూర్తిస్థాయిలో చేపట్టాలని నిర్ణయించింది. ప్రాధాన్యతాక్రమంలో కేఎల్ఐతో పాటు మార్కండేయ, అచ్చంపేట ఎత్తిపోతల, డిండి, ఎస్ఎల్‌బీసీ ఎత్తిపోతల పథకాల పనులను పూర్తిచేసి, సాగునీటి సరఫరా ప్రారంభించాలనే లక్ష్యాన్ని పెట్టుకుంది. అయితే అందుకు అత్యంత కీలకమైన భూసేకరణ పనుల్లో మాత్రం పురోగతి ఉండటం లేదు.

20 ఏళ్లుగా పెండింగ్‌లోనే..
కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద కాల్వల నిర్మాణం 2005లో చేపట్టగా.. పూర్తిస్థాయి పనులు ఇప్పటికీ పూర్తికాలేదు. ఉమ్మడి జిల్లాలోని కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, జడ్చర్ల, వనపర్తి నియోజకవర్గాల పరిధిలో సుమారు 4.50 లక్షల ఎకరాలకు సాగునీరందించాలనే లక్ష్యంతో ఈ ఎత్తిపోతల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టింది. అయితే ఏళ్లుగా పూర్తిస్థాయి నిర్మాణానికి నోచుకోకపోవడంతో, సగం మేర ఆయకట్టుకే పరిమితమైంది. ప్రస్తుతం 3.07 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయి పరిస్థితి మాత్రం భిన్నంగా ఉంది. డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లు నిర్మించని కారణంగా పూర్తిస్థాయి లక్ష్యం నెరవేరడం లేదు. అలాగే విస్తరణ పనుల కింద చేపట్టాల్సిన పనులు ఇంకా మొదలుపెట్టలేదు. ఇందుకు భూసేకరణ చేపట్టాల్సి ఉండగా, ఈ ప్రక్రియ సంక్లిష్టంగా మారుతోంది. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం 27, 28, 29, 30 ప్యాకేజీల్లో కలిపి మొత్తం 143 ఎకరాల వరకు భూసేకరణ చేపట్టాల్సి ఉంది. ఈ ప్రక్రియలో విడతల వారీగా పనులు చేపట్టారు. అయితే 20 ఏళ్లు గడుస్తున్నా పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. కేఎల్ఐ 28వ ప్యాకేజీ కింద 84 కి.మీ., 29వ ప్యాకేజీ కింద 160 కి.మీ., 30వ ప్యాకేజీ కింద 80 కి.మీ. మేర కొత్తగా కాల్వలను తవ్వాల్సి ఉంది. తర్వాతి దశలో 30వ ప్యాకేజీ కింద కల్వకుర్తి నియోజకవర్గంలోని మాడ్గుల్ మండలం వరకు ఆయకట్టు విస్తరించేలా డిస్ట్రిబ్యూటరీ కాల్వలను నిర్మించాలని ప్రతిపాదించారు. 29వ ప్యాకేజీ కింద డీ–82 కెనాల్ విస్తరణలో సుమారు 37 ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రణాళికలు రూపొందించినా.. ఇందుకు అవసరమైన పనులు ముందుకు సాగడం లేదు. మరోవైపు డిస్ట్రిబ్యూటరీ చానళ్ల నిర్మాణం సైతం పూర్తికాకపోవడం.. ఉన్న కాల్వలకు లైనింగ్ పనులు చేపట్టకపోవడంతో ఆయకట్టు రైతులకు సరిపడా సాగునీరు అందడం లేదు.

మార్కండేయ, అచ్చంపేట ఎత్తిపోతలకు సైతం..

సుమారు 7 వేల ఎకరాలకు పైగా సాగునీరు అందించేందుకు బిజినేపల్లి మండలం శాయినిపల్లి వద్ద చేపట్టిన మార్కండేయ ప్రాజెక్టుకు భూసేకరణ పూర్తికాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే సమీపంలో 14 గ్రామాలు, తండాల రైతులకు సాగునీరు అందనుంది. అచ్చంపేట బ్రాంచ్ కెనాల్ విస్తరణ ద్వారా ఉప్పునుంతల మండలం వరకు సుమారు 15 వేల ఎకరాలకు సాగునీరు అందేలా చేపట్టిన పనులు సైతం భూసేకరణ అడ్డంకితోనే ప్రారంభానికి నోచుకోవడం లేదు.

పనుల వేగవంతానికి చర్యలు..

కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పెండింగ్ పనుల కోసం భూసేకరణ ప్రక్రియ విడతల వారీగా కొనసాగుతోంది. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు భూసేకరణ వేగవంతం చేసేందుకు రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారుల సమన్వయంతో కృషి చేస్తున్నాం. వారానికోసారి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తాం.

– సీతారామారావు, అడిషనల్ కలెక్టర్

బాధ్యులెవరు..?

- మధ్యాహ్న భోజనం బియ్యంలో నాణ్యత డొల్ల
- సివిల్ సప్లయ్ నుంచే పురుగులు పట్టినవి సరఫరా?
- ఎక్కువ కాలం గోడౌన్, బడుల్లో నిల్వ ఉండటంతో పాడవుతున్న వైనం
- చాలా పాఠశాలల్లో క్వింటాళ్ల కొద్ది పాడైన బియ్యం
- అనారోగ్యం బారిన విద్యార్థులు.. అభానుపాలవుతున్న వంట ఏజెన్సీలు



చిట్టెలు పట్టిన బియ్యం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న సంఘటనలు కలకలం రేపుతున్నాయి. బుధవారం నారాయణపేట జిల్లా మాగనూర్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిన్న పలువురు విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరారు. అయితే ఇందుకు బాధ్యులైన పలువురు అధికారులపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటువేసింది. సంఘటన జరిగిన ప్రతిసారి ఏదో ఒక అధికారిపై చర్యలు తీసుకోవడం తర్వాత వదిలేయడంతో సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారం లభించడం లేదు. ఫలితంగా నిత్యం ఎక్కడో ఒకచోట నాణ్యత లేని ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న సంఘటనలు వెలుగుచూస్తూనే ఉన్నాయి. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు తినే మధ్యాహ్న భోజన బియ్యం నాణ్యతా ప్రమాణాలు లేకుండా సరఫరా చేస్తుండటమే ఇందుకు కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా..
సివిల్ సప్లయ్ అధికారులు ఎక్కువకాలం గోడౌన్‌లలో నిల్వ చేసిన బియ్యాన్ని పాఠశాలలకు సరఫరా చేస్తున్నట్లు పలువురు హెచ్ఎంలు పేర్కొంటున్నారు. ఈ బియ్యాన్ని కొన్ని రోజుల పాటు పాఠశాలలోనూ నిల్వ ఉంచడంతో పురుగులు పడుతున్నట్లు తెలుస్తుంది. వారంలో ఒక్కసారి సీఆర్పీ (క్లస్టర్ రీసోర్సుపర్సన్) పరిశీలించి కేవలం వారం రోజులకు బియ్యం నిల్వ ఉండేలా మాత్రమే చూడాలి. కానీ, పాఠశాలల్లో క్వింటాళ్ల కొద్ది బియ్యం నిల్వలు ఉండడం వల్ల అక్కడ చాలా వరకు పాడైపోయి పురుగులు పట్టి చిట్టెలు కట్టే పరిస్థితి నెలకొంది. జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో క్వింటాళ్ల కొద్ది బియ్యం నిల్వలు ఉన్నట్లు తెలుస్తుంది. చాలా బియ్యం పాడైపోవడంతో నెలల త్వరబడి వాటిని వినియోగించకుండా మూలకు పడేస్తున్నారు.

రీసైకిల్ చేసి సరఫరా..?
ఎక్కువకాలం బియ్యం గోడౌన్‌లలో, పాఠశాలలో నిల్వ ఉండటం వల్ల పురుగులు పడుతున్నాయి. మంచి బియ్యాన్ని సివిల్ సప్లయ్ వారు సరఫరా చేస్తే నేరుగా వాటిని ఏజెన్సీ వారు వండి వడ్డించే అవకాశం ఉంది. కానీ, ప్రతి పాఠశాలలో కూడా చాలా వరకు నిల్వ ఉన్న బియ్యమే వాడుతున్నారు. అయితే ఏజెన్సీ వారు ప్రతిరోజు కూడా వాటిని జల్లెడ ఆడించి వండాల్సి వస్తుంది. అయినప్పటికీ కొన్నిచోట్ల పురుగులు వస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్నిచోట్ల దొడ్డు బియ్యాన్ని రీసైకిల్ చేసి సన్నగా మార్చిన వాటిని పాఠశాలలకు సరఫరా చేయడంతో బియ్యాన్ని కడుగుతుంటేనే అవి రెండుగా విరిగిపోతున్నట్లు ఏజెన్సీ వారు ఆరోపిస్తున్నారు. అక్షయ పాత్ర వారు సరఫరా చేస్తున్న అన్నం సైతం ఉడికి ఉడకనట్లు ఉండడం, కూరలు, సాంబార్ వంటి వాటిలో నాణ్యత లేకపోవడం వంటివి చోటుచేసుకుంటున్నాయి. ఉదయం వండి.. మధ్యాహ్నానికి పాఠశాలలకు పంపించడంతో నాణ్యత దెబ్బతింటున్నట్లు సమాచారం.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం..

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం కోసం వినియోగించే బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులు నాణ్యమైన వాటినే సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటాం. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి సైతం తీసుకువెళ్తాం. బియ్యాన్ని తీసుకునే క్రమంలో పాఠశాల హెచ్ఎం సైతం నాణ్యత ఉన్న బియ్యాన్ని మాత్రమే తీసుకోవాలి. ఎక్కువ కాలం బియ్యం నిల్వ ఉండకుండా జాగ్రత్తపడాలి.

– ప్రవీణ్‌కుమార్, డీఈఓ

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

● భర్తనే కడతేర్చాడని భార్య కుటుంబసభ్యుల ఫిర్యాదు


మృతిచెందిన శ్రావణి

ఆత్మకూర్: అనుమానాస్పదంగా ఓ వివాహిత మృతిచెందిన సంఘటన సోమవారం ఆత్మకూర్‌లో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరేందర్ తెలిపిన వివరాలు.. స్థానిక బీసీకాలనీలో నివాసముంటున్న శ్రావణి(30) సోమవారం మధ్యాహ్నం 3:30గంటల సమయంలో చీరతో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. విషయాన్ని గమనించిన భర్త పరశురాములు ఆమెను కిందకి దించి చుట్టుపక్కలవారికి, భార్య కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. వారు అక్కడికి చేరుకొని చికిత్స కోసం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలికి ఒక కుమారుడు, ఒక కూతురు ఉన్నారు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భర్తే హతమార్చాడంటూ ఫిర్యాదు

తమ కూతురు శ్రావణిని భర్త పరశురాములే హతమార్చాడని మృతిరాలి తండ్రి తెలుగు పోషన్న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శివమాల దీక్షలో ఉన్న అల్లుడే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని పేర్కొన్నాడు. పిల్లలు సమగ్ర విచారణ చేపట్టాలని ఆయన పోలీసులను అభ్యర్థించాడు.

పురుగుమందు తాగి మహిళ బలవన్మరణం

మాగనూర్: పురుగు మందు తాగి ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మండలంలోని నేరెడుగోమ్ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పద్మమ్మ(52) అనే మహిళ మోకాళ్ల నొప్పులతో బాధపడేది. ఆసుపత్రుల్లో ఎంత చూయించినా తగ్గలేదు. ఆబాధను భరించలేక సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగింది. ఆమె పెద్ద కుమారుడుకు విషయం తెలియడంతో తండ్రి నాగప్పకు సమాచారం అందించాడు. చికిత్స కోసం మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

చెరువులో వృద్ధుడి మృతదేహం లభ్యం

బిజినేపల్లి : మండలంలోని మహాదేవునిపేట గ్రామానికి చెందిన సత్తయ్య(65) అనే వృద్ధుడి మృతదేహం సోమవారం ఉదయం గంగారంచెరువులో లభ్యమైంది. కొందరు గ్రామస్తులు చెరువు వైపున వెళ్లగా వారికి వృద్ధుడి మృతదేహం కనిపించింది. వారు ఆ మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. రెండు రోజుల కింద చెరువులో పడి అతడు చనిపోయి ఉండవచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. చెరువు దగ్గరే అంత్యక్రియలు నిర్వహించారు.

సంపులో మహిళ మృతదేహం..

● భర్తపైనే పోలీసుల అనుమానం


నారమ్మ (ఫైల్)

అడ్డాకుల: భూత్పూర్ మండలం వెల్కిచర్లలో సొంత ఇంటి ముందున్న సంపులో అదే ఇంటి మహిళ మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామానికి చెందిన మారేపల్లి నారమ్మ(40) ఈ నెల 16 నుంచి కనిపించడం లేదు. దీంతో కుటుంబ సభ్యులు అంతటా వెదికినా లాభం లేకపోవడంతో హైదరాబాద్‌లో ఉండే ఆమె కుమారుడు భరత్ ఈ నెల 21న భూత్పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఇంటి ముందున్న సంపులో నారమ్మ మృతదేహం ఉందన్న సమాచారంతో సోమవారం పోలీసులు పైకప్పు తొలగించారు. అందులో మృతదేహం కనిపించడంతో బయటకు తీసి శవ పరీక్షల నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. నారమ్మ మృతిపై ఆమె భర్త వెంకటయ్యపై అనుమానం ఉన్నట్లు తెలుస్తోంది. భర్తే ఈ దురాగతానికి పాల్పడినట్లు సమాచారం.

ఆర్‌ఐడీకి స్వర్ణోత్సవ శోభ

కొల్లాపూర్‌లో 92 ఏళ్ల క్రితం రాణి ఇందిరాదేవి పాఠశాల ఏర్పాటు


కొల్లాపూర్‌లోని ఆర్‌ఐడీ పాఠశాల

- పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో రేపటి నుంచి స్వర్ణోత్సవాలు
- మూడు రోజులపాటు కొనసాగనున్న వేడుకలు
- హాజరుకానున్న ప్రముఖులు
- నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి ప్రణాళికలు


పాఠశాలలో ఏర్పాటుచేసిన వాటర్‌ప్లాంట్

కొల్లాపూర్: చదువుకోవాలంటే సవాలక్ష ఆంక్షలు ఉన్న రోజుల్లో ప్రజలకు ఉచిత విద్య అందించాలని సంకల్పించారు కొల్లాపూర్‌లోని సురభి రాజవంశస్థులు. అందులో భాగంగా కొల్లాపూర్ సంస్థానంలో 1930లో రాణి ఇందిరాదేవి (ఆర్‌ఐడీ) పేరిట ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటుచేశారు. ఆ పాఠశాలలో వేలాది మంది ఓనమాలు నేర్చుకొని, విద్యావంతులు అయ్యారు. పలు రంగాల్లో స్థిరపడి.. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు సాధించారు. 94 ఏళ్ల క్రితం స్థాపించిన ఆ పాఠశాలకు మళ్లీ పునర్వైభవం తీసుకువచ్చేందుకు పలువురు పూర్వవిద్యార్థులు నడుం బిగించారు. అందుకోసం పూర్వ విద్యార్థులందరినీ సంఘటితం చేస్తున్నారు. నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి తమవంతు సహకారం అందించాలనే మంచి లక్ష్యంతో ముందడుగు వేస్తున్నారు.

27 నుంచి 29 వరకు స్వర్ణోత్సవాలు..

ఆర్‌ఐడీ పాఠశాల స్వర్ణోత్సవాలను ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించేందుకు పూర్వ విద్యార్థులు ఏర్పాట్లు చేస్తున్నారు. 27న ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించనున్నారు. 28న ప్రముఖుల ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 29న ఉత్సవాల ముగింపు సందర్భంగా ప్రముఖ సినీ మ్యూజిక్ డైరెక్టర్ తమన్‌తో పాటు పలువురు సినీ నటులు హాజరై ప్రదర్శనలు ఇవ్వనున్నారు. ఉత్సవాల ప్రారంభానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. ప్రారంభం రోజున సినీ నటుడు విజయ్ దేవరకొండ రానున్నారు. ఉత్సవాలను రాజ బంగ్లాలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పాఠశాల ప్రస్థానం ఇలా..

సురభి రాజుల పరిపాలనలో ప్రజలకు ఉచిత విద్య అందించాలనే ఉద్దేశంతో రాజా వెంకట జగన్నాథ రావు తన సతీమణి రాణి ఇందిరాదేవి పేరిట 1930 జూన్ 1వ తేదీన ప్రభుత్వ పాఠశాలను ప్రారంభించారు. అప్పట్లో ఒకటి నుంచి నాలుగో తరగతి వరకే ఉండేది. 1950లో పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేశారు. 1969లో పాఠశాలకు అనుసంధానంగా ఆర్‌ఐడీ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. పాఠశాల, కళాశాల రెండింటిలో కలిపి ఇప్పటి వరకు వేలాది మంది విద్యనభ్యసించారు.

చదువుకున్న ప్రముఖులు..

మై హోమ్ అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు స్వగ్రామం కొల్లాపూర్ మండలంలోని కుడికిళ్ల. ఆయన ఆర్‌ఐడీ పాఠశాలలో ఎస్‌ఎస్‌సీ పూర్తిచేసి, కళాశాలలో ఇంటర్ విద్యనభ్యసించారు. తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఎల్లూరి శివారెడ్డి, బిట్స్‌పిలానీ వైస్ చాన్సలర్, నానో సైంటిస్ట్ వలిపె రాంగోపాల్‌రావు, ఐసీహెచ్‌ఆర్ మాజీ డైరెక్టర్ ప్రభాకర్‌రావు, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు పలువురు ప్రముఖులు ఆర్‌ఐడీలోనే చదువుకున్నారు. ఇక్కడ చదువుకున్న వారు చాలా మంది ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారు.

రూ. కోటి వ్యయంతో ఆధునికీకరణ..

ఆర్‌ఐడీ పాఠశాల ఆధునికీకరణకు మై హోమ్ అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు ముందుకొచ్చారు. అందుకోసం రూ. కోటికి పైగా ఖర్చు చేశారు. మూడు నెలలుగా పనులు సాగుతున్నాయి. రూ. 30 లక్షల వ్యయంతో టేబుళ్లు, కుర్చీలు, కంప్యూటర్లు, ల్యాబ్ సామగ్రి, వాటర్ ప్యూరిఫైడ్ యంత్రాలు, డైనింగ్ హాల్ ఫర్నిచర్ ఏర్పాటు చేశారు. మోడ్రన్ టాయిలెట్లు, పాఠశాలకు ప్రహరీ, వంటశాల నిర్మాణ పనులు పూర్తిచేశారు.

విద్యాభివృద్ధికి రోడ్‌మ్యాప్..

ఆర్‌ఐడీ స్వర్ణోత్సవాలకు దేశంలోని 11 యూనివర్సిటీలకు చెందిన వైస్‌చాన్స్‌లర్లు, ప్రముఖ కవి, రచయితలు అందెశ్రీ, జయరాజ్, దేశపతి శ్రీనివాస్, గోరటి వెంకన్న రానున్నారు. రాష్ట్రంలోని పలువురు పారిశ్రామికవేత్తలను కూడా ఉత్సవాలకు ఆహ్వానించారు. వారితో చర్చించి కొల్లాపూర్‌లో విద్యాభివృద్ధికి, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేందుకు ఒక రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేసేందుకు ఉత్సవ కమిటీ ప్రతినిధులు సిద్ధమయ్యారు.

కొల్లాపూర్ ముస్తాబు..

ఆర్‌ఐడీ స్వర్ణోత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యే అవకాశం ఉండటంతో కొల్లాపూర్‌లోని ప్రధాన రహదారులను బాగుచేస్తున్నారు. రోడ్డు పక్కన ఉన్న ముళ్లపొదలను తొలగించడం, రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చివేసే పనులు కొనసాగుతున్నాయి. రాజబంగ్లా పరిసరాలను శుభ్రం చేశారు. ఉత్సవాలకు హాజరయ్యే అతిథులకు అన్ని రకాల వసతీ సౌకర్యాలు కల్పించేందుకు మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశానుసారం స్థానిక నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. మంత్రి తనయుడు జూపల్లి అరుణ్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

మంచి సందేశం ఇచ్చేందుకే..



ఆర్‌ఐడీ పాఠశాలకు గొప్ప చరిత్ర ఉంది. ఇక్కడ చదువుకున్న వాళ్లు దేశ, విదేశాల్లో స్థిరపడ్డారు. జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు. వారందరినీ సంఘటితం చేయాలని స్వర్ణోత్సవాలకు శ్రీకారం చుట్టాం. పూర్వవిద్యార్థులు, గురువులను ఆహ్వానిస్తున్నాం. గ్రీన్, క్లీన్, సస్టెయినబుల్ కొల్లాపూర్ అనే నినాదంతో ముందుకు సాగాలని మా కమిటీ భావిస్తోంది. అందుకోసం 2050 సంవత్సరం వరకు రోడ్‌మ్యాప్ ఏర్పాటు చేసుకుంటాం. కొల్లాపూర్‌లో విద్య, ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రయత్నిస్తాం. అందుకు పారిశ్రామికవేత్తలు, స్థానిక రాజకీయ నాయకుల సహకారం తీసుకుంటాం. ప్రజలకు మంచి సందేశం ఇచ్చేందుకు ఏర్పాటుచేస్తున్న ఆర్‌ఐడీ స్వర్ణోత్సవాలకు పూర్వవిద్యార్థులు అందరూ హాజరుకావాలని కోరుతున్నా.

– డా.సాయిప్రసాద్,
శాస్త్రవేత్త, ఆర్‌ఐడీ అలుమ్ని వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు

చెరువు అలుగు ధ్వంసం

● ఆందోళనకు దిగిన ఆయకట్టు రైతులు

కృష్ణా: మండలంలోని హిందూపూర్ దేశాయి నోటిఫైడ్ చెరువు అలుగు దిండును ఆదివారం రాత్రి ఓ పార్టీ నాయకుడు ధ్వంసం చేయడంతో ఆయకట్టు రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. దాదాపు 100 మంది రైతులు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని అధికారులకు ఫిర్యాదు చేశారు. చెరువు అలుగు దిండును ధ్వంసం చేయొద్దని అడ్డుపడినా వినకుండా ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై తహసీల్దార్ దయాకర్‌రెడ్డి స్పందిస్తూ.. చెరువు అలుగు దిండును ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు చేయాలని ఎస్‌ఐ నవీద్‌కు ఆదేశించినట్లు తెలిపారు. అలాగే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు.

లేడీస్ కార్నర్ గోదాంలో షార్ట్‌సర్క్యూట్

● కాలి బూడిదైన సామగ్రి.. రూ.15 లక్షల ఆస్తినష్టం



గోదాంలో ఎగిసిపడుతున్న మంటలు

గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు లేడీస్ కార్నర్ గోదాంలో మంటలు చెలరేగి సామగ్రి అగ్నికి ఆహుతైన ఘటన గద్వాలలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కూరగాయల మార్కెట్ సమీపంలో పై అంతస్తులో ఉన్న హరీశ్‌కుమార్ లేడీస్ కార్నర్ గోదాంలో సోమవారం సాయంత్రం షార్ట్‌సర్క్యూట్ జరిగి క్షణాల్లో మంటలు పెద్దఎత్తున ఎగిసిపడ్డాయి. స్థానికులు గుర్తించి వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారమిచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించారు. అదుపులోకి వచ్చే సమయంలో ట్యాంకర్‌లో నీరు ఖాళీ కావడంతో పుర చైర్మన్ కేశవ్ ట్యాంకర్ల ద్వారా నీటిని అందించగా అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాదంతో దుకాణంలో ఉన్న సామగ్రి కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.15 లక్షల నష్టం వాటిల్లిందని యజమాని తెలిపారు.

హార్వెస్టర్ దగ్ధం



పెద్దకొత్తపల్లి: పాత యాపట్ల గ్రామంలో సోమవారం నర్సింహ అనే రైతు మొక్కజొన్న పంటను కోస్తుండగా హార్వెస్టర్‌కు షార్ట్ సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించి పూర్తిగా కాలిపోయింది. వీపనగండ్ల మండలం, బొల్లారం గ్రామానికి చెందిన కావలి భూపాల్ నాయుడుకు చెందిన మిషన్ కాలిపోయింది. దీంతో రూ.25లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. నాగర్‌కర్నూల్ ఫైర్‌స్టేషన్ అధికారి కృష్ణమూర్తి సంఘటనా స్థలానికి చేరుకుని హార్వెస్టర్ మంటలను ఆర్పివేశారు. ఫైర్ సిబ్బంది కర్ణాకర్, మీనారెడ్డి, త్రివర్ధన్‌రెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.

జూరాలకు తగ్గిన వరద

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద సోమవారం పూర్తిగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. కేవలం 568 క్యూసెక్కుల వరద వస్తుండగా.. ఆవిరి రూపంలో 71 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 390, కుడి కాల్వకు 350, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 100 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామని చెప్పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 9.459 టీఎంసీల నీటినిల్వ ఉన్నట్లు వివరించారు.

రామన్‌పాడులో పూర్తిస్థాయి నీటిమట్టం..

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో సోమవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులు ఉన్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమకాల్వ ద్వారా 390 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుతుండగా.. ఎన్టీఆర్ కాల్వకు 911 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వకు 25 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని పేర్కొన్నారు.

సాయిరెడ్డి అంత్యక్రియలు పూర్తి

వంగూర్: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మండలంలోని సీఎం రేవంత్ రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ సాయిరెడ్డి అంత్యక్రియలు సోమవారం స్వగ్రామంలో ముగిశాయి. సాయిరెడ్డి ఈ నెల 22న రాత్రి ఆత్మహత్యకు పాల్పడగా.. ఆయన కుమారుడు అమెరికా నుంచి రావడానికి ఆలస్యం కావడంతో అంత్యక్రియలు పూర్తికాలేదు. సోమవారం తెల్లవారుజామున కల్వకుర్తికి రాగా.. అక్కడి ప్రభుత్వ ఆస్పత్రిలో సాయిరెడ్డి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు మృతదేహాన్ని స్వగ్రామం కొండారెడ్డిపల్లికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ క్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా కొండారెడ్డిపల్లిలో పోలీస్ పికెటింగ్, బందోబస్తు నిర్వహించారు. అలాగే ఇతర గ్రామస్తులు ఎవరూ కొండారెడ్డిపల్లికి రాకుండా గ్రామ శివారులలో బారికేడ్లు ఏర్పాటు చేశారు.

వృద్ధుడి అదృశ్యం.. కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాకేంద్రానికి చెందిన కొత్త నాగయ్య ఈ నెల 23 నుంచి కనబడకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ గోవర్ధన్ తెలిపారు. నాగయ్య స్వీపర్‌గా పనిచేస్తుండేవాడని.. ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇప్పటి వరకు రాలేదని, కుటుంబ సభ్యులు ఎక్కడ వెదికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని చెప్పారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయొద్దని వినతి


మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పెద్దధన్వాడ గ్రామస్తులు

రాజోళి: మండలంలోని పెద్ద ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని రద్దు చేయాలని సోమవారం గ్రామస్తులతో పాటు, చిన్న ధన్వాడ, పచ్చర్ల, తుమ్మిళ్ల, మాన్‌దొడ్డి, నసనూర్ తదితర గ్రామాల ప్రజలు హైదరాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌కు వినతిపత్రం అందచేశారు. ఫ్యాక్టరీ నిర్మాణంతో ఆరోగ్య ఇబ్బందులతో పాటు పంటలు పండవని, వాతావరణం కలుషితం అవుతుందన్నారు. భవిష్యత్ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నిర్మాణం జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

చిన్నచింతకుంట ఎస్‌ఐపై ఎస్పీకి ఫిర్యాదు

పాలమూరు: కురుమూర్తిస్వామి దర్శనానికి వెళ్తున్న బీజేపీ కార్యకర్తపై చిన్నచింతకుంట ఎస్‌ఐ అనుచిత వ్యాఖ్యలు చేయడంతోపాటు కర్రతో చితకబాదారని, వెంటనే ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఎస్పీ జానకికి ఫిర్యాదు చేశారు. ఎస్పీ కార్యాలయంలో బీజేపీ నేతలు కలిసి ఫిర్యాదు అందించారు. స్టేషన్‌కు తీసుకువెళ్లిన తర్వాత కూడా దురుసుగా ప్రవర్తించడం జరిగిందని ఆరోపించారు. ఎస్‌ఐపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు పాండురంగారెడ్డి, అంజయ్య, రమేష్ పాల్గొన్నారు.

రక్తమోడిన రహదారులు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రహదారులపై రక్తమోడాయి. ఆదివారం రాత్రి, సోమవారం వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం చెందగా.. పలువురు తీవ్రగాయాల పాలయ్యారు. ఆయా ఘటనలకు సంబంధించి వివరాలిలా..

- వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి దుర్మరణం
- పలువురికి తీవ్ర గాయాలు



తీర్థయాత్రలకు వెళ్లొస్తూ.. అనంతలోకాలకు

అడ్డాకుల: తీర్థయాత్రలకు వెళ్లిన ఓ కుటుంబంలో విషాదం నెలకొంది. యాత్ర ముగించుకుని ఇంటికి వెళ్తున్న క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందగా.. మరో మహిళకు గాయాలైన ఘటన అడ్డాకుల మండలం కాటవరం శివారులోని 44వ నంబర్ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ వివరాల మేరకు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురం జిల్లా చిన్నవడ్డూరు గ్రామానికి చెందిన చిన్న నాగప్పగారి రామాంజనమ్మ(65) కుటుంబ సభ్యులు ఈ నెల 21న కారులో తీర్థయాత్రలకు బయలుదేరారు. శ్రీశైలం, భద్రాచలం, విజయవాడలో దైవ దర్శనాలను ముగించుకుని స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు శాఖాపూర్ టోల్‌ప్లాజా దాటిన తర్వాత కాటవరం శివారులో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి అవతలి వైపు ఉన్న హైదరాబాద్ రోడ్డుపై వాహనం బోల్తాపడింది. అందులో ఉన్న రామాంజనమ్మ తీవ్రంగా గాయపడింది. ఆమెతోపాటు రామలక్ష్మికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రామాంజనమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ద్విచక్రవాహనంపై వస్తుండగా..

ఎర్రవల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందిన ఘటన కోదండాపురం పీఎస్ పరిధిలో ఎన్‌హెచ్–44పై చోటు చేసుకుంది. ఎస్‌ఐ స్వాతి వివరాల మేరకు.. మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన అఫ్రీంబాషా (29) ఎర్రవల్లిలోని ఓ ఫర్టిలైజర్ దుకాణంలో పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి పని ముగించుకొని ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా.. ధర్మవరం స్టేజీ సమీపంలో గుర్తు తెలియని వాహనం వెనక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ ఘటనపై అఫ్రీంబాషా తండ్రి మహబూబ్ బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

కార్వంగలో వృద్ధుడు..

తెలకపల్లి: ఇంటి ఎదుట నిద్రిస్తున్న వృద్ధుడిపై బొలెరో వాహనం వెళ్లడంతో దుర్మరణం చెందాడు. ఈ ఘటన తెలకపల్లి మండలం కార్వంగలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కార్వంగ గ్రామానికి చెందిన మేడిపూర్ సవారయ్య (80) ఇంటి ఎదుట గోడ పక్కన నిద్రించగా.. రివర్స్‌లో వస్తున్న బొలెరో వాహనం అతడిపై వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి హైదరాబాద్ ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యంలోనే మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

బైక్ కిందపడి.. ఇద్దరికి గాయాలు

తిమ్మాజిపేట: ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి అదుపు తప్పి బైక్ కింద పడింది. మండలంలోని రాళ్లచెరువుతండా సమీపంలో సోమవారం రాత్రి జరిగిన ఈ ఘటనలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. జడ్చర్ల– ఆవంచ ప్రధాన రహదారిపై రైతులు ధాన్యం ఆరబెట్టారు. రాత్రి 6.30 గంటల ప్రాంతంలో తాడూరు మండలం సిర్సవాడకు చెందిన బంగారయ్య, భల్లాన్‌పల్లికి చెందిన విజయ్‌కాంత్ ద్విచక్రవాహనంపై జడ్చర్ల నుంచి ఆవంచ వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా ట్రాక్టర్ రావడంతో తప్పించబోయి అదుపుతప్పి కిందపడ్డారు. ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం జడ్చర్ల ఆస్పత్రికి తరలించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు..

కొత్తకోట రూరల్: మండలంలోని మిరాసిపల్లి గ్రామ స్టేజీ దగ్గర జాతీయ రహదారి–44పై రోడ్డు దాటుతున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలైన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పరశురాములు గ్రామానికి వెళ్లేందుకు జాతీయ రహదారి దాటుతుండగా వేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు క్షతగాత్రుడిని 108లో వనపర్తి ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

హైదరాబాద్‌లో కానుకుర్తి వాసి మృతి


నర్సింహులు (ఫైల్)

దామరగిద్ద: హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో భవన నిర్మాణ పనులు చేస్తున్న హరిజన్ బొర్ర నర్సింహులు (33) ప్రమాదవశాత్తు పరంచ పైనుంచి పడి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారి కథనం మేరకు.. మండలంలోని కాన్‌కుర్తికి చెందిన నర్సింహులు బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. సోమవారం భవన నిర్మాణంలో భాగంగా పరంచాపై పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడటంతో తీవ్రంగా గాయాలయ్యాయి. అక్కడే పనిచేస్తున్న భార్య, తోటి కార్మికులు వెంటనే సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. నర్సింహులుకు భార్య సంతోష, ఇద్దరు కుమారులు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ బసిరెడ్డి కోరారు.

చికిత్స పొందుతూ మహిళ..

తెలకపల్లి: చికిత్స పొందుతున్న ఓ మహిళ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు ఎస్‌ఐ నరేశ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. బల్మూరుకు చెందిన పుట్టా మల్లమ్మ (26) కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయి తల్లిగారి ఊరైన తెలకపల్లి మండలం రాకొండకు నెల క్రితం వచ్చింది. ఈ నెల 23న రాత్రి భోజనం చేసిన తర్వాత పొలానికి వెళ్లి పురుగు మందు తాగింది. గుర్తించిన కుటుంబ సభ్యులు జిల్లా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ వివరించారు. తల్లి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఓ కరపత్రం 'ఏడు'పు కథ!

సెకీతో ఒప్పందాన్ని 7 గంటల్లోనే ఆమోదించారంటూ ఈనాడు వక్రీకరణ ● వాస్తవాలను దాచిపెట్టి విషం చిమ్మడమే అసలు లక్ష్యం


సెకి దస్త్రానికి.. 7 గంటల్లో ఆమోదం!

7 గంటల్లోనే సెకీ దస్త్రాన్ని ఆమోదించారంటూ 'ఈనాడు' రాసిన అబద్ధపు కథనం


అగ్రవర్ణ పేదలకు దన్ను
మరిన్ని కీలక నిర్ణయాలు ఇలా..

సెప్టెంబర్ 15న సెకీ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాస్తే అనేక చర్చలు, అధ్యయనాలు అనంతరం అక్టోబర్ 28న మంత్రి మండలి ఆమోదించింది. అందుకు సాక్ష్యం ఇదిగో..

- సేద్యానికి పగలు 9 గంటల విద్యుత్ కోసం సోలార్ ఎనర్జీ కార్పొరేషన్‌తో ఒప్పందం
- యూనిట్ రూ.2.49 చొప్పున ఏటా 7 వేల మెగావాట్లు కొనుగోలు
- మంత్రివర్గం నిర్ణయాలను వెల్లడించిన మంత్రి పేర్ని నాని

▸▸ వ్యవసాయానికి పగటి పూట తొమ్మిది గంటలు నిరంతరాయంగా నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ఏటా 7 వేల మెగావాట్ల విద్యుత్‌ను యూనిట్ రూ.2.49కే కొనుగోలు చేస్తూ కేంద్ర ప్రభుత్వ సంస్థ సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో ఒప్పందానికి ఆమోదం. 25 ఏళ్ల పాటు ఈ సంస్థ విద్యుత్‌ను సరఫరా చేయనుంది.

'సెకీ'ఒప్పందంతో లాభాలివీ..

- కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ) యూనిట్ రూ.2.49కే సోలార్ విద్యుత్తు అందచేస్తామంటూ తనకు తానుగా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపింది.
- ఈ ప్రతిపాదనకు ఏపీ అంగీకరించడం వల్ల 25 ఏళ్ల పాటు ఐఎస్‌టీఎస్ చార్జీల నుంచి మినహాయింపు లభిస్తుందని 2021 సెప్టెంబర్ 15న రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన లేఖలో సెకీ స్పష్టం చేసింది.
- ఈ చారిత్రక ఒప్పందం వల్ల రాష్ట్ర ఖజానాకు ఏటా రూ.3,750 కోట్లు చొప్పున 25 ఏళ్ల పాటు దాదాపు రూ.లక్ష కోట్ల మేర విద్యుత్తు భారం నుంచి ఆర్థిక ప్రయోజనం చేకూరుతుంది.
- ఐఎస్‌టీఎస్ చార్జీల నుంచి మినహాయింపు అనేది మరే ఇతర ప్రాజెక్ట్‌కి దక్కని చాలా కీలకమైన ప్రయోజనం. ఇతర రాష్ట్రంలో ఉన్న సోలార్ పవర్ ఉత్పాదక కేంద్రం నుంచి విద్యుత్ సరఫరా కోసం మరే ఇతర సంస్థతో ఒప్పందం చేసుకుంటే మన రాష్ట్రం ఐఎస్‌టీఎస్ ఛార్జీలను చెల్లించాల్సి వచ్చేది. అప్పుడు అది చాలా భారంగా మారుతుంది. ప్రతి నెలా మెగా వాట్‌కు సుమారు రూ.4 లక్షలు దానికే ఖర్చవుతుంది.
- రాష్ట్ర డిస్కంలు మునుపెన్నడూ ఇంత తక్కువ ధరకు సౌర విద్యుత్‌ను కొనుగోలు చేసిన దాఖలాలు లేవు.
- ఇది కేంద్ర సంస్థ సెకీతో గత ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం. ఇందులో మూడో వ్యక్తి ప్రమేయానికి తావే లేదు. అలాంటప్పుడు ఇక లంచాలకు ఆస్కారం ఎక్కడుంటుంది?
- టీడీపీ హయాంలో కుదుర్చుకున్న అధిక ధరల పీపీఏలతో పోలిస్తే సెకీతో సగం కంటే తక్కువ ధరకే ఒప్పందం కుదిరింది.

సాక్షి, అమరావతి: వక్రీకరణలే పరమావధిగా పచ్చి అబద్ధాలను కుమ్మరిస్తున్న ఈనాడు.. గత సర్కారు ఏడు గంటల్లోనే సెకీతో ఒప్పందాన్ని క్యాబినెట్ భేటీలో ఆమోదించుకుందంటూ మరోసారి బుకాయించింది. రాష్ట్ర రైతాంగానికి ఉచిత విద్యుత్తుకు ఢోకా లేకుండా ప్రయోజనం జరుగుతోంటే రూ.లక్ష కోట్లకుపైగా భారం అంటూ అసత్య ఆరోపణలు చేసింది. ఈ ఒప్పందానికి ఐఎస్‌టీఎస్ చార్జీలు వర్తించవని తెలిసినా పదేపదే విషం చిమ్ముతూ అదే ఒరవడి కొనసాగిస్తోంది. నిజానికి రెండున్నర నెలల పాటు సుదీర్ఘ కసరత్తు.. లాభనష్టాల బేరీజు.. నిపుణుల కమిటీ పరిశీలన.. మంత్రివర్గంలో చర్చ.. చివరిగా విద్యుత్తు నియంత్రణ మండలి గ్రీన్ సిగ్నల్.. ఇన్ని దశలు దాటి ప్రక్రియలన్నీ పక్కాగా పాటించాకే సెకీతో ఒప్పందం కార్యరూపం దాల్చింది. వ్యవసాయ ఉచిత విద్యుత్తుకు ఢోకా లేకుండా పాతికేళ్ల పాటు అత్యంత చౌకగా సౌర విద్యుత్‌ను అందిస్తామని, అంతరాష్ట్ర ప్రసార చార్జీల నుంచి సైతం మినహాయింపు కల్పిస్తామని 2021 సెప్టెంబర్ 15న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సెకీ స్వయంగా ప్రతిపాదిస్తూ లేఖ రాసింది. దీనిపై సాధ్యమైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని సెకీ కోరడంతో 2021 సెప్టెంబర్ 16న అప్పటికే ముందుగా నిర్ణయించిన తేదీ ప్రకారం కేబినెట్ సమావేశంలో దీన్ని టేబుల్ ఐటమ్‌గా ప్రవేశపెట్టారు. అంతేగానీ సెకీ లేఖపై అప్పటికప్పుడు నిర్ణయం తీసుకోవటం కోసంగానీ.. ఆమోదించడం గానీ జరగలేదు. ముఖ్యమైన విషయాలు అత్యవసరంగా క్యాబినెట్ దృష్టికి వచ్చినప్పుడు టేబుల్ ఐటమ్ కింద ప్రవేశపెట్టడం పరిపాటి, ఆనవాయితీ. అందులో ఏం తప్పు ఉంది? ఈ క్రమంలో దీనిపై లోతైన అధ్యయనానికి కమిటీని నియమించి క్యాబినెట్‌కు నివేదిక ఇవ్వాలని గత ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఈ దశలన్నీ పూర్తయ్యాకే 2021 అక్టోబర్ 28న క్యాబినెట్ సమావేశంలో ఒప్పందానికి ఆమోదం లభించింది. ఏపీఈఆర్‌సీ నుంచి కూడా అనుమతి తీసుకోవాలని డిస్కమ్‌లను నిర్దేశించారు. అంతేగానీ ఈనాడు చెబుతున్నట్లుగా హడావుడిగా ఒప్పందాన్ని ఆమోదించాలనుకుంటే అంతకుముందు జరిగిన మంత్రివర్గ సమావేశంలోనే ఆమోదించి ఉండాలి కదా? నెలల తరబడి ఎందుకు ఆగుతారు? ఇలా సుదీర్ఘంగా చర్చలు, పలు ప్రక్రియలు ముగిశాకే 2021 డిసెంబర్ 1న సెకీతో ఒప్పందం జరిగింది.

అర్థ రహిత ఆరోపణలు..

2021 సెప్టెంబర్ 15న సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ (సెకీ) యూనిట్ రూ.2.49కే సౌర విద్యుత్‌ను సరఫరా చేస్తామని చెప్పింది. నిజానికి ఈ ధర అప్పటి వరకు ఇతర మార్గాల్లో విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లకు వస్తున్న విద్యుత్ ధరల కంటే చాలా తక్కువ. పైగా కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రోత్సాహం కింద 'అంతర్ రాష్ట్ర ప్రసార ఛార్జీల (ఐఎస్‌టీఎస్) నుంచి మినహాయింపు'కూడా ఈ ఒప్పందానికి వర్తింపజేస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వానికి సెకీ లేఖ రాసింది. అయితే సెకీ నుంచి విద్యుత్‌ను తీసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం 7 గంటల వ్యవధిలోనే అంగీకరించిందని, రాష్ట్రానికి వచ్చే ప్రయోజనాలేమిటి? అంత విద్యుత్ వినియోగించగలమా? లాంటి అంశాలను పరిగణలోకి తీసుకునేందుకు తగినంత సమయం కేటాయించలేదని ఈనాడు మొదటి ఆరోపణ చేసింది. సెకీ ప్రతిపాదన వల్ల ప్రజలపై రూ.1,10,000 కోట్ల మేర ఆర్థిక భారం పడుతుందని ఆలోచించలేదనేది రెండో ఆరోపణ. కానీ ఈ రెండూ పచ్చి అబద్ధాలే. ప్రజల్ని తప్పుదోవ పట్టించేందుకు అల్లుకున్న కట్టుకథలు మినహా ఇందులో ఏ ఒక్కటీ వాస్తవం కాదు.

రెండున్నర నెలలు.. విశ్లేషించాకే అనుమతి..

సౌర విద్యుత్తుకు సంబంధించి పలు ప్రయోజనాలను కల్పిస్తూ 2021 సెప్టెంబర్ 15న సెకీ నుంచి ప్రతిపాదన వచ్చింది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సెకీ, రాష్ట్ర ప్రభుత్వం, డిస్కంల మధ్య విద్యుత్ విక్రయ ఒప్పందం (పవర్ సేల్ అగ్రిమెంట్) 2021 డిసెంబర్ 1న జరిగింది. అంటే ప్రతిపాదనకు – ఒప్పందానికి మధ్య రెండున్నర నెలల కంటే ఎక్కువ వ్యవధి ఉంది. ఆ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎవరితోనూ ఎలాంటి ఒప్పందాలు కుదుర్చుకోలేదు. ఈ రెండున్నర నెలల్లో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, సెకీ మధ్య పలు పర్యాయాలు సంప్రదింపులు జరిగాయి. సెకీ ప్రతిపాదనలో లోటుపాట్లను, ఒప్పందం వల్ల కలిగే లాభనష్టాలను లోతుగా విశ్లేషించారు. అంతేకాకుండా ఈ ప్రతిపాదనకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ) ఆమోదాన్ని 2021 నవంబర్ 8న కోరారు. 2021 నవంబర్ 11న ఏపీఈఆర్‌సీ నుంచి దీనికి ఆమోదం లభించింది. సెకీ ప్రతిపాదనపై రాష్ట్ర ప్రభుత్వం చేసిన కసరత్తు, అందుకోసం తీసుకున్న సమయం రెండున్నర నెలలకంటే ఎక్కువ ఉన్నట్లు ఇంత స్పష్టంగా కనిపిస్తున్నా ఈనాడు మాత్రం 7 గంటల్లోనే ఆమోదం తెలిపేశారంటూ పచ్చి అబద్ధాలను ప్రచురించింది.

క్షుణ్నంగా సుదీర్ఘ కసరత్తు..

సెకీ ఒప్పందాన్ని అమలు చేయాలనే నిర్ణయాన్ని మంత్రి మండలి సెప్టెంబర్ 16వ తేదీన తీసుకుందని ఈనాడు మరో ఆరోపణ చేసింది. వాస్తవం ఏమిటంటే మంత్రి మండలి సమావేశాన్ని అప్పటికప్పుడు నిర్ణయించలేదు. అంతకుముందు వారం రోజుల క్రితమే ఆ సమావేశం షెడ్యూల్ ఖరారైంది. అంటే.. కేబినెట్ సమావేశం తేదీపై నిర్ణయం తీసుకునే నాటికి సెకీ నుంచి ఎలాంటి ప్రతిపాదన రాష్ట్ర ప్రభుత్వానికి రాలేదు. సమావేశానికి ఒక రోజు ముందు మాత్రమే సెకీ లేఖ అందింది. తమ లేఖపై వీలైనంత త్వరగా స్పందన తెలియజేయాలని ఆ లేఖలో సెకీ కోరింది. అయితే మొత్తం ప్రక్రియకు కనీసం 2 నుంచి 3 నెలల సమయం పడుతుందనే వాస్తవాన్ని గ్రహించిన రాష్ట్ర ప్రభుత్వం.. సెకీ కోరినట్లుగా ప్రక్రియను ఆలస్యం చేయకూడదని భావించి తగిన మార్గదర్శకాల కోసం 2021 సెప్టెంబర్ 16న మంత్రి మండలి సమావేశంలో ఈ అంశాన్ని టేబుల్ ఐటమ్‌గా ఉంచింది. ఈ ప్రతిపాదనపై మరింత క్షుణ్నంగా అధ్యయనం చేయాలని రాష్ట్ర ఇంధన శాఖను నాటి సమావేశంలో మంత్రి మండలి ఆదేశించింది. సెకీ ప్రతిపాదనను పరిశీలించేందుకు ఆంధ్రప్రదేశ్ పవర్ కోఆర్డినేషన్ కమిటీ(ఏపీపీసీసీ) చైర్మన్ నేతృత్వంలో ఒక కమిటీని కూడా ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో కమిటీ సభ్యులు పలుదఫాలు సెకీ అధికారులతో చర్చలు జరిపారు. అనంతరం 2021 అక్టోబర్ 25న సెకీ ప్రతిపాదనకు అనుకూలంగా కమిటీ తన సిఫార్సులను ప్రభుత్వానికి సమర్పించింది. దీంతో అక్టోబర్ 28న జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆ సిఫార్సులను మంత్రి మండలి ముందు ఉంచారు. ఏపీఈఆర్‌సీ అనుమతికి లోబడి సెకీతో పీఎస్‌ఏ అమలును ఆమోదించాలని మంత్రి మండలి నిర్ణ యం తీసుకుంది. దీంతో 2021 నవంబర్ 8న ఏపీఈఆర్‌సీ ఆమోదం కోసం డిస్కంలు దరఖాస్తు చేశా యి. 2021 నవంబర్ 11న ఏపీఈఆర్‌సీ ఆమోదం పొందిన తర్వాతే 2021 డిసెంబర్ 1న ఒప్పందం జరిగింది. కాబట్టి టీడీపీ, ఈనాడు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, దురుద్దేశపూర్వకంగా చేస్తున్నవని స్పష్టం అవుతోంది.


ఎన్నిసార్లు చెప్పినా.. పాడిందే పాట!

ఇక ఈనాడు చేసిన రెండో ఆరోపణపై వాస్తవానికి స్పందించడం కూడా అనవసరం. ఎందుకంటే సెకీతో ఒప్పందం వల్ల ఐఎస్‌టీఎస్ చార్జీలు వర్తించవని డిస్కంలు అనేకసార్లు ఆధారాలతో సహా చెప్పినప్పటికీ ఈనాడు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ ఆ భారాన్ని రాష్ట్రం భరించాల్సి వస్తుందంటూ మళ్లీ అదే అబద్ధాన్ని వల్లె వేసింది. ఈ ప్రాజెక్టు కోసం ప్రత్యేక ఇన్సెంటివ్ కింద ఐఎస్‌టీఎస్ చార్జీల నుంచి మినహాయింపును కేంద్ర ప్రభుత్వం అందించిందని సెకీ తన ప్రతిపాదనలో స్పష్టంగా పేర్కొంది. ఐఎస్‌టీఎస్ చార్జీలు వర్తించవని, దీని నుంచి మినహాయింపు లభిస్తుందని తెలిపే లేఖను స్పష్టత కోసం అనేకసార్లు ప్రజలకు అందుబాటులో ఉంచినా టీడీపీ కరపత్రంలా ఈనాడు అబద్ధాలను ప్రచారం చేస్తూనే ఉంది.

ఆర్డీఎస్ రైతుల మధ్య వాగ్వాదం

అలంపూర్: నీటి సరఫరాలో రైతుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఆర్డీఎస్ డీ–40కి చెందిన ఒక సర్వే నంబర్‌లోని పంట పొలాల్లోకి నీళ్ల వెళ్లడం ఘర్షణకు కారణమైంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా.. అలంపూర్ మండలం బుక్కాపురం గ్రామ శివారులోని ఆర్డీఎస్ డీ–40లోని ఒక సర్వే నంబర్‌లోని పంట కాల్వకు సోమవారం నీటిని దారి మళ్లించారు. దీంతో సమీపంలోని కొందరు రైతుల పంట పొలాల్లోకి నీళ్ల వెళ్లాయి. అయితే తమ పంటలు దెబ్బతినే అవకాశం ఉండటంతో ఈ ప్రాంత రైతుల మధ్య ఘర్షణ వాతావరణానికి కారణమైంది. ఈ ఘటనకు సంబంధించి ఆర్డీఎస్ ఏఈని కొందరు నాయకులు నియోజకవర్గ ప్రజాప్రతినిధి వద్దకు బలవంతంగా తీసుకెళ్లినట్లు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. అయితే కొద్ది సేపటి తర్వాత ఆర్డీఎస్ ఏఈ శ్రీనివాసులు సోషల్ మీడియా ద్వారా వీడియో పోస్టు చేశారు. నీటి విడుదలకు సంబంధించి కొందరు నాయకులు ఎమ్మెల్యే కలవాలని చెప్పడంతో వచ్చానని, తనను ఎవరూ బలవంతంగా తీసుకురాలేదని అందులో పేర్కొన్నారు. ఈ విషయమై అలంపూర్ ఎస్‌ఐ వెంకటస్వామిని వివరణ కోరగా ఆర్డీఎస్ ఏఈ తమకు రక్షణ కావాలని కోరారని, అయితే ఎవరిపైనా ఫిర్యాదు చేయలేదని వివరించారు.

చెరుకు ధర పెంచాలి



అమరచింత: కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో చెరుకు పండిస్తున్న రైతులకు టన్ను చెరుకుకు రూ. 4వేల ధర కల్పించాలని చెరుకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్ గోపి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ జబ్బార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ డీజీఎం మురళి, ఏజీఎం పాండురంగరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఫ్యాక్టరీ పరంగా టన్ను చెరుకుకు రూ. 3,366 చెల్లిస్తున్నారని.. ఇది రైతులకు గిట్టుబాటు కావడం లేదన్నారు. కోత కార్మికులకు ఇస్తున్న కూలీ డబ్బులను స్వయంగా ఫ్యాక్టరీనే భరించి, రైతులకు టన్ను చెరుకు రూ. 4వేల ధర ఇవ్వాలన్నారు.

కురుమూర్తివాసా గోవిందా..


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

- జాతరకు తరలివస్తున్న భక్తులు
- ఆలయంలో ప్రత్యేక పూజలు

చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపురం కురుమూర్తిస్వామి జాతరకు భక్తులకు భారీగా తరలివస్తున్నారు. సోమవారం ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు కొబ్బరికాయలు కొట్టి, ఆలయ మెట్లపై, స్వామివారి పాదుకుల వద్ద, ఆలయ సన్నిధిలో దీపాలు వెలిగించి దర్శించుకున్నారు. పలువురు భక్తులు కొండ దిగువన దాసంగాలు పెట్టి గండదీపాలు మోసి తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలువేలు మంగమ్మ, ఉద్దాల మండపం, ఆంజనేయస్వామి, చెన్నకేశవస్వామి ఆలయాల వద్ద, జాతర మైదానంలోని దుకాణాల్లో భక్తుల రద్దీ కనిపించింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది అన్ని సౌకర్యాలు కల్పించారు.

కోడెదూడల వేలం..

కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాల్లో భక్తులు స్వామి వారికి మొక్కుబడిగా సమర్పించిన కోడెదూడల వేలాన్ని సోమవారం ఆలయ అధికారులు నిర్వహించారు. వేలం ద్వారా రూ.1.68 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ మధనేశ్వర్‌రెడ్డి, చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది శివానందాచారి, సభ్యులు కమలాకర్, ఉంద్యాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


కొబ్బరికాయలు కొట్టేందుకు క్యూలైన్లో నిలిచిన భక్తులు


జాతర మైదానంలో కోడె దూడల వేలం

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


టోర్నీలో పాల్గొంటున్న జట్లు

- త్వరలో క్రీడా పాఠశాలలు ఏర్పాటు
- ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి
- అండర్–19 రాష్ట్ర ఫుట్‌బాల్ టోర్నీ ప్రారంభం


టోర్నీని లాంఛనంగా ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల టౌన్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి పిలుపునిచ్చారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జడ్చర్లలో నిర్వహిస్తున్న అండర్–19 బాల బాలికల ఫుట్‌బాల్ రాష్ట్ర టోర్నీని సోమవారం ఆయన ప్రారంభించారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డితో కలసి క్రీడకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థుల కోసం త్వరలోనే క్రీడాపాఠశాలలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జడ్చర్ల స్టేడియం మైదానంలో సింథటిక్ ట్రాక్ కోసం రూ.9కోట్లు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఇండోర్‌స్టేడియం తీసుకువస్తానని, రాబోయే రోజుల్లో స్టేడియంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు ఎంఈఓ మంజులాదేవి, మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, డీఐఈఓ కౌసర్‌జహా, డీవైఎస్ఓ శ్రీనివాస్, తెలంగాణ ఫిజికల్ డైరెక్టర్ అసోసియేషన్, పీఈటీ అసోసియేషన్ అధ్యక్షుడు నిరంజన్తోపాటు పర్యవేక్షకులు రాము, ప్రసాద్, కౌన్సిలర్లు సతీష్, రఘురాంగౌడ్, రమేష్, పీడీలు పాపిరెడ్డి, మోయిన్, విలియం, శారదబాయి, పీఈటీ కృష్ణ, రాము, శ్రీను, భానుకిరణ్ పాల్గొన్నారు.

హోరాహోరీగా టోర్నీ

టోర్నీలో భాగంగా మొదటిరోజున బాలుర 5, బాలికల 5 మ్యాచ్‌లు జరిగాయి. ఆతిథ్య జట్టు బాలుర విభాగంలో రంగారెడ్డితో తలపడి డ్రాచేసుకుంది. బాలికల విభాగంలో రంగారెడ్డి జట్టుతో ఓటమి పాలయ్యింది.

చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్


మూసాపేటలో సరస్వతిదేవి విగ్రహానికి నివాళులర్పిస్తున్న రిటైర్డ్ డీఈఓ విజయకుమార్

అడ్డాకుల: జాతిపిత మహాత్మాగాంధీ ఎదుర్కొన్న కష్టాలు, చరిత్రను తెలుసుకుని ఆయనను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ముందడుగు వేయాలని రిటైర్డ్ డీఈఓ విజయకుమార్ అన్నారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ ఆధ్వర్యంలో చేపట్టిన 100 రోజులు 1000 కిలోమీటర్ల బాపు బాటలో సత్య శోధన పాదయాత్రలో భాగంగా సోమవారం మూసాపేటలో ఆయన పాదయాత్ర చేపట్టారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సరస్వతిదేవి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్న విషయాన్ని విద్యార్థులు గుర్తించాలని కోరారు. నైతిక, ఆధ్యాత్మిక విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాల్సిన అవసరముందన్నారు. ప్రస్తుత సమాజం మారితేనే మన పిల్లల భవిష్యత్ బాగుపడుతుందన్న విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించాలని కోరారు. మన ఆలోచనలు, ఆశయాలు, ఆచరణ మారితే తప్పా మన పిల్లలకు మంచి జీవితాన్ని ఇవ్వలేమన్న దాన్ని తల్లిదండ్రులు గ్రహించాలని చెప్పారు. హింస ప్రవృత్తిని రెచ్చగొడుతూ, స్వార్థంతో ఆలోచిస్తూ, ఎంతటి మోసాలకైనా తెగిస్తూ, తల్లిదండ్రులు, పెద్దలపై గౌరవం లేకుండా వ్యవహరిస్తూ పిల్లలు బాగుండాలంటే ఎలా సాధ్యమని ప్రశ్నించారు. పిల్లల కోసం బతకడమంటే వారి కోసం ఆస్తులు సంపాదించడం కాదన్న విషయం తల్లిదండ్రులు గుర్తెరగాలన్నారు. అందుకే పెద్దలుగా ముందు మనం మారుతూ.. గాంధీజీ అడుగుజాడల్లో నడుస్తూ పిల్లల బంగారు భవిష్యత్‌కు బాటలు వేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ రాజేశ్వర్‌రెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయులు శివకుమార్, పీటీ సుగుణ, ఉపాధ్యాయులు నర్సప్ప, శివశరణప్ప, గోవర్ధన్‌రెడ్డి, పరమేశ్వర్, నాగరాజు, శోభారాణి, అరుణకుమారి, గీతాజ్ఞాన, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

'పాలమూరు' ప్రాజెక్టును పూర్తిచేయాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రాములు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: జిల్లాలోని అమిస్తాపూర్‌లో నిర్వహించే రైతు సదస్సుకు హాజరవుతున్న సీఎం రేవంత్‌రెడ్డి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపాలని, ప్రధానంగా పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు సత్వరమే పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రాములు అన్నారు. సోమవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదండాపూర్ నిర్వాసితులకు పరిహారం పెంచాలని, రైతు రుణమాఫీ ప్రతి రైతుకు అమలు చేయాలని, రైతు భరోసా డబ్బులు వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలన్నారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా పాలమూరు ప్రాజెక్టు పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారిందని దుయ్యబట్టారు. కొడంగల్– నారాయణపేట ఎత్తిపోతలపై ఉన్న ప్రేమ పాలమూరు ప్రాజెక్టుపై ముఖ్యమంత్రికి లేదని ఆరోపించారు. ఉపాధి హామీ పనిదినాలను 200 రోజులకు పెంచాలని, కూలీ రూ.600 ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు కిల్లె గోపాల్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నల్లవెల్లి కురుమూర్తి, జిల్లా కమిటీ సభ్యులు రాజ్‌కుమార్, నాయకులు చంద్రకాంత్, మోహన్, దీప్లానాయక్, భరత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.